# స్పందన
తెలుగు దినపత్రిక

TGTEL/26/A6780

సంపుటి :01 | సంచిక :15 | పేజీలు 8 | వెల : 5

సోమవారం 28 సెప్టెంబర్ 2026




రైతులను మోసగించిన భారాస, కాంగ్రెస్



## ధైర్యంగా ఉండండి..
# బేజారు కావద్దు

మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తారు

అప్పటివరకు కష్టాలను ఓర్చుకోవాలి

ఎల్‌నినో పేరుతో తప్పించుకుంటున్న ప్రభుత్వం

యూరియా, రైతుబంధు ఇవ్వాల్సి వస్తుందనే పంటలకు నీరివ్వట్లే

: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 27: 'రైతులకు నీరిస్తే యూరియా, రైతుబంధు ఇవ్వాల్సి ఉంటుంది.. పండిన పంటకు మద్దతు ధర, బోనస్ ఇవ్వాల్సి వస్తుంది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌నినో పేరు చెప్పి తప్పించుకుంటోంది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆదివారం కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి దశదిన కర్మకు నాగర్ కర్నూల్ జిల్లాకు కేటీఆర్ వచ్చారు. తిరుగు ప్రయాణంలో దేశిఇటిక్యాల వద్ద రైతులు తమ పంటలు పరిశీలించాలని ఆయన వాహనాన్ని ఆపడంతో దిగి పత్తి, మొక్కజొన్న చేనుల్లోకి వెళ్లి పరిశీలించారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఉమ్మడి

-మిగతా 2 లో..

## సీలింగ్ భూముల్లోని నివాసాలకు
# ప్రభుత్వం ఊరట

యూఎల్‌సీలోని కాలనీల క్రమబద్ధీకరణ

వేల సంఖ్యలో కుటుంబాలకు భరోసా

22ఏలోని సీలింగ్ భూముల చిక్కులు పోయినట్లే

ఏళ్లుగా క్రమబద్ధీకరణ జరగక పూర్తిస్థాయి హక్కులు దక్కని సీలింగ్ భూముల్లోని నివాసాలకు ప్రభుత్వం భారీఊరట ఇచ్చే ఆదేశాలు జారీచేసింది. తెలంగాణ పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం (యూఎల్‌సీ) భూముల్లో గతంలో కొంతమేర క్రమబద్ధీకరణ అయినవి, పూర్తిగా క్రమబద్ధీకరణ కాని కాలనీలకు విముక్తి కల్పించేందుకు మెమో నం.48062ను జారీచేసింది. ఆదివారం రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఈ ప్రక్రియకు సంబంధించిన ఆదేశాలు జారీచేశారు.




హైదరాబాద్, సెప్టెంబర్ 27: ఇటీవల శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి... 22 ఏ నిషేధిత భూముల జాబితాలో నమోదైన అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూముల్లోని ఇళ్ల క్రమబద్ధీకరణ చేపడతామని భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి... అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించి మెమో జారీకి నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ మహా నగరపరిధితో పాటు అన్ని జిల్లాల్లో ఉన్న యూఎల్‌సీ క్రమబద్ధీకరణ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ ప్రక్రియతో 22 ఏ జాబితా నుంచి కూడా ఈ భూములు బయటపడనున్నాయి. యూఎల్‌సీ భూముల్లో ఉన్న అర్హులైన లబ్ధిదారులను తేల్చేబాధ్యతను ప్రభుత్వం కలెక్టర్లకు అప్పగించింది. ఇప్పటికే పెండింగ్ ఉన్న దరఖాస్తుల పరిశీలన చేపట్టనున్నారు. యూఎల్‌సీ చట్టం కింద ప్రభుత్వానికి అప్పగించిన భూములను గతంలోనే చాలాచోట్ల పేదలకు పంపిణీ చేశారు. కొన్నిచోట్ల కొంత విస్తీర్ణాలు ప్రభుత్వ ఖాతాలో ఉండిపోయాయి. కాలక్రమంలో ఈ భూముల్లో కాలనీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వ భూములను రక్షించేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టం ప్రకారం ఆయా సర్వే నంబర్లను సెక్షన్ 22 ఏలో చేర్చిన

-మిగతా 2 లో..



# నేడు ఢిల్లీకి
## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. రెండు రోజుల పాటు ఆయన ఢిల్లీలో పర్యటించనున్నారు. 28న ఒక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం.. 29న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో సీఎం పాల్గొంటారు. 30న ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకొని.. సిరిసిల్లలో బహిరంగ సభకు హాజరవుతారు. డాక్టర్ మన్మోహన్‌సింగ్ పేరిట ప్రత్యేక ఎర్త్‌వర్సిటీ ఏర్పాటు చేశాం మాజీ ప్రధాని దివంగత డాక్టర్ మన్మోహన్‌సింగ్ గౌరవార్థం తెలంగాణలో ఇప్పటికే ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి, 2025 డిసెంబరు 2న ప్రారంభించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో మన్మోహన్‌సింగ్ విగ్రహావిష్కరణపై సీనియర్ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ 'ఎక్స్'లో హర్షం వ్యక్తంచేశారు.



## ఉగ్రవాదానికి దీటుగా
# బదులిచ్చాం

మన సత్తాను ప్రపంచానికి చాటాం

మెరుపు దాడులకు నేటితో పదేళ్లు

మన్ కీ బాత్‌లో గుర్తు చేసిన ప్రధాని

దిల్లీ: ఉగ్రవాదం చేసే గాయాలకు భారత్ ఎలాంటి నిర్ణయాత్మక స్పందన చూపిస్తుందనేది ఇప్పటికే రుజువు చేశామని, మన విధానం ఎలా ఉంటుందో చెప్పేందుకు ఉదాహరణగా నిలిచామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గత పదేళ్లలో బాలాకోట్ గగనతల దాడుల నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు స్పష్టమైన సందేశాన్ని పలుమార్లు పంపించామని చెప్పారు. సరిగ్గా పదేళ్ల క్రితం.. 2016 సెప్టెంబరు 28, 29 తేదీల్లో పాక్‌లోని ఉగ్రవాద తండాలపై మన సైన్యం వీరోచితంగా విరుచుకుపడి ముష్కరులను మట్టుబెట్టిన సందర్భాన్ని ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన గుర్తు చేసుకున్నారు. ఉగ్రవాద దాడులతో దీర్ఘకాలం దేశంపడ్డ వేదనకు మెరుపు దాడులతో సరికొత్త స్పందనను చూపించామని చెప్పారు.

**డ్రగ్స్ నిర్మూలనలో పాలు పంచుకోండి**

మాదక ద్రవ్యాల నిర్మూలన ఉద్యమంలో యువత పాలుపంచుకుని ఆ మహమ్మారిని తుద ముట్టించాలని మోదీ పిలుపునిచ్చారు. "ఇటీవల లక్షల మంది యువతీ యువకులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిన బూనారు. ఈ సందేశాన్ని అందరికీ వ్యాప్తి చేసే బాధ్యతను తీసుకున్నారు.



# కాళేశ్వరం మోటార్లను
# నిరంతరాయంగా నడిపించాలి

సిద్దిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం మోటార్లను ఎనిమిది గంటలు నడిపి..16 గంటలు బంద్ పెడుతోందని, దీనివల్ల యంత్రాలు పాడవుతాయని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మోటార్లు నిరంతరాయంగా నడిపించాలని ఆయన కోరారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లోని రంగనాయక్‌సాగర్ ప్రాజెక్టులో జలకళను ఆదివారం ఆయన పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సిద్దిపేట పట్టణంలో కేసీఆర్ ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 60 రోజుల పాటు సిద్దిపేటలోని తన నివాసంలో ఉద్యోగ అభ్యర్థులందరికీ మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తానన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆయనమాట్లాడుతూ..రంగనాయకసాగర్‌ను పూర్తిస్థాయి లో నింపి రైతుల పంటపొలాలకు సాగునీరు అందించాలన్నారు. ప్రాజెక్టు కుడి కాల్వ ద్వారా నర్మెట్టలోని ఆయిల్‌పామ్ పరిశ్రమకు నీటి కొరత తీరిందన్నారు. కేవలం 16 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేశామని అసెంబ్లీలో వారే అంగీకరించారని పేర్కొన్నారు. హరీశ్‌రావు వెంట భారాస స్థానిక నాయకులున్నారు.

**రాబోయే యాసంగికి సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పి మోసం చేసిందని హరీశ్‌రావు విమర్శించారు.**

## నేటి నుంచి పట్టభద్రుల
# ఓటర్ల నమోదు

ఫారం-18 నింపాలి.. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో సమర్పించాలి

ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్న రాజకీయ పార్టీలు



2లో



2లో

నేరేడుచర్లలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

## రాహుల్‌గాంధీ
# ప్రధాని కావడం తథ్యం



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ గారి

## 111 వ జయంతి

సందర్భంగా రవీంద్ర భారతిలో



## ఉగ్రవాదాన్ని ఉపేక్షించబోము

(మొదటిపేజీ తరువాయి)

కీలక కేంద్రాలు, శిక్షణ, ఆయుధాలు, నిధుల వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నామని వివరించారు. ఉగ్రవాదంపై పోరులో సాయుధ బలగాల ధైర్యసాహసాలను ప్రధాని ప్రశంసించారు. దేశ రక్షణ కోసం వారు చేసిన త్యాగాలను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో దేశం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని యువత ఓ పురాతన బావిని శుభ్రం చేస్తున్న వీడియోను మోదీ పంచుకున్నారు. చెత్తచెదారంతో కూడిన బావిని యువకులు శుభ్రం చేస్తున్నట్లు అందులో కనిపిస్తోంది. గతంలో జరిగిన కార్యక్రమంలో నంద్యాల జిల్లాలోని పురాతన బావిని శుభ్రం చేయడాన్ని మోదీ ప్రస్తావించిన విషయం తెలిసిందే.




## ఆర్థిక ఇబ్బందుల్లోనూ టీచర్లకు మేలు చేశాం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గ్రామీణ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్'ను ప్రారంభించిందన్నారు. ఈ స్కూళ్లను ప్రతి మండలానికీ విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్టీయూ మరింత బలోపేతం కావాలని.. ఉపాధ్యాయ లోకానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తే కార్పొరేట్ సంస్థల కంటే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగులకు దసరా, ఉగాది డీఏలతోపాటు పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి అమలు చేయాలని కోరారు. ఆ సంస్థ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఆర్సీ అమలు చేసి 2028 ఎన్నికల వరకు మరో పీఆర్సీ కమిటీని ప్రకటిస్తే ఉద్యోగులంతా రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉంటారని తెలిపారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ మాట్లాడుతూ అన్ని హక్కులు పొందే వరకు ఎస్టీయూ విశ్రమించబోదని చెప్పారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, ఎస్టీయూ నాయకులు, ఏఐఎస్టీఎఫ్ వివిధ రాష్ట్రాల నాయకులు, టీచర్లు పాల్గొన్నారు.




## ఓట్ల చోరీతో బీజేపీ పట్టుబడింది

(మొదటిపేజీ తరువాయి)

సందేహాలపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను, స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. అలాగే నేరేడుచర్లలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ దేశంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) పూర్తి పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్వయంగా ఎన్నికల సంఘంలోని మిగిలిన ఇద్దరు కమిషనర్లే సీఈసీ పక్షపాత వైఖరిని తప్పుబట్టారని చెప్పారు. ఇది తీవ్రమైన రాజ్యాంగ సంక్షోభమని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న వారు నేడు ఆధారాలతో సహా పట్టుబడ్డారన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కొన్నేళ్లుగా నిరుపేదల కోసం దేశాన్ని కాపాడేందుకు నిరంతరం కష్టపడుతున్నారని.. కాబట్టి ఆయన్ను దేశ ప్రధానిని చేయాలని ప్రజలు చూస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని.. ఈ స్మార్ట్ రేషన్‌కార్డులు పేదోడి ఆత్మగౌరవం అని మంత్రి ఉత్త మ్ చెప్పారు. గత ప్రభుత్వం రూ. 10,500 కోట్లు ఖర్చు చేసి ఇచ్చిన రేషన్ దొడ్డు బియ్యం ప్రజలు తినేందుకు పనికిరాకుండా ఉండేదని.. కోళ్ల ఫారాలకు, బీర్ల కంపెనీలకు, రైస్ మిల్లుల దందాలకుమాత్రమే ఉపయోగపడేదని విమర్శించారు.

## కేంద్రం నిబంధనలతో సంక్షోభంలోకి రైస్ మిల్లులు

**హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన అధికారిక పత్రంలో కఠిన నిబంధనలు ఉన్నందున, రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా రైస్ మిల్లులు తీవ్ర సంక్షోభంలోకి వెళ్లి, మూతపడే ప్రమాదం ఉందని రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు ఆవేదన చెందారు. ఆదివారం హైదరాబాద్‌లో మంత్రిని ఎమ్మెల్యే మందుల సామేల్, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఈసీ మెంబర్ సయ్యద్ రఫీ, తెలంగాణ రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు గణపతిరెడ్డి, వీరేశం కలిశారు. భవిష్యత్తులో మిల్లింగ్ రంగం కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లే పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయని, ప్రభుత్వం చర్యలు చేపట్టి.. పరిష్కారమార్గాన్ని చూపాలని విన్నవించారు.

## ప్రభుత్వ సలహాదారు ఎన్వీఎస్‌రెడ్డికి అదనపు బాధ్యతలు

**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ సలహాదారు(పట్టణ రవాణా)గా ఉన్న విశ్రాంత ఐఆర్ఏఎస్ అధికారి ఎన్వీఎస్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. గతంలో జారీ చేసిన ఉత్తర్వులకు పాక్షిక సవరణలు చేస్తూ ఎన్వీఎస్‌రెడ్డి హోదాను తెలంగాణ ప్రభుత్వ సలహాదారు(పట్టణ రవాణా అండ్ మెట్రో)గా మార్పులు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ జీవో జారీ చేసింది. మెట్రో మొదటి దశ భద్రత, నిర్వహణకు సంబంధించి అదనపు ఎండీతో సమన్వయం, ఆర్టీసీ, ఇతర ప్రజారవాణా వ్యవస్థలతో కలిసి కామన్ టికెటింగ్ విధానాన్ని అమలు చేయడంలో సమన్వయం చేసుకుంటూ రోజు, వారం, నెలవారీ పాస్‌లను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టడం, నగరంలో ట్రాఫిక్, రవాణా ప్రాజెక్టులపై సలహాలు అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# నేటి నుంచి పట్టభద్రుల ఓటర్ల నమోదు



హైదరాబాద్:నల్గొండ నియోజకవర్గాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఓటర్ల నమోదు ప్రక్రియకు ఎన్నికల సంఘం అధికారులు సోమవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ ఏడాది నవంబరు 1 నాటికి.. డిగ్రీ పూర్తిచేసి మూడేళ్లు పూర్తయిన పట్టభద్రులు ఓటర్లుగా నమోదుకు అవకాశం ఉంది. ఇందుకుగాను ఫారం-18 నింపాల్సి ఉంటుంది. నవంబరు 6 వరకు ఓటర్ల నమోదుకు ఎన్నికల అధికారులు అవకాశం కల్పించారు. డీఈవోలు, ఈఆర్వోలు, ఏఈఆర్వోల కార్యాలయాల వద్ద ఫారం-18 పత్రాలను అందుబాటులో ఉంచనున్నారు. పోస్టుద్వారా కూడా ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు దరఖాస్తులను పంపించవచ్చు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల సంఘం వెబ్‌సైట్ http://ceotelangana.nic.in లో ఆన్‌లైన్ ద్వారా కూడా ఫారాన్ని సమర్పించవచ్చు.

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల గడువు 2027 మార్చితో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 17న ఓటర్ల జాబితా షెడ్యూల్‌ను ఎన్నికల అధికారులు విడుదల చేశారు.

**ఆన్‌లైన్‌వైపే మొగ్గు..**

రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ ఎమ్మెల్సీ స్థానాలను ప్రధాన పార్టీలు సవాలుగా తీసుకుంటున్నాయి. ఇప్పటికే ఓటర్ల నమోదుకు చేపట్టాల్సిన వ్యూహాలపై దృష్టి సారించాయి. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసేవిధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని గ్రామాలవారీగా డిగ్రీ పూర్తిచేసి మూడేళ్లు పూర్తయినవారిని గుర్తిస్తున్నారు. మండల కేంద్రాల్లో ప్రత్యేక ల్యాప్‌టాప్‌లతో శిబిరాలను ఏర్పాటుచేసి ఆన్‌లైన్‌లో వారి పేర్లను నమోదుచేసేలా సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు ఉపాధ్యాయ సంఘాలు కూడా టీచర్లను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదుచేయించే విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. చాలామంది పట్టభద్రులు ఆన్‌లైన్ ద్వారా ఓటరు నమోదు వైపు మొగ్గు చూపనున్నారు. ఆన్‌లైన్‌లో ఫారం-18 నింపిన తర్వాత ప్రింట్ తీసి స్థానిక

ఎన్నికల అధికారులకు ఆ పత్రాలను అందించాల్సి ఉంటుంది. మరోవైపు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వారికి ఈఆర్వో, డీఈవో కార్యాలయాల్లో పత్రాలను అందుబాటులో ఉంచుతామని ఎన్నికల నమోదు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఇంతవరకు ఈ పత్రాలు జిల్లాలకు చేరలేదు. ఈ పత్రాలు ఎన్నికల అధికారుల కార్యాలయాలకు చేరడానికి రెండు, మూడు రోజులు పట్టే అవకాశాలున్నాయి. మరోవైపు ప్రస్తుతం రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) నోటీసుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఎన్నికల అధికారులు ఓటర్ల నమోదుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.

# రైతులను మోసగించిన భారాస, కాంగ్రెస్: ఎంపీ అర్వింద్

నిజామాబాద్: భారాస, కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులను మోసగించాయని.. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఆదివారం భాజపా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా బోధన్ అంబేడ్కర్ చౌరస్తా నుంచి జగిత్యాల వరకు సైకిల్‌యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. నిజామాబాద్ కంఠేశ్వర్ బైపాస్‌లో ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి మహిళా సైక్లింగ్ పోటీల ప్రారంభోత్సవంలో కూడా ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. "ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. రేవంత్‌రెడ్డి తన విధానాలతో రాహుల్‌గాంధీని పక్కదారి పట్టిస్తున్నారు.



## ధైర్యంగా ఉండండి.. బేజారు కావద్దు

(మొదటిపేజీ తరువాయి)



పాలమూరు జిల్లాలో 40 శాతానికి పైగా పంటలు నష్టపోయిన పరిస్థితి కనిపిస్తోందని, పత్తి రంగుమారి క్వింటా రూ.4వేలు కూడా వచ్చే పరిస్థితి లేదని, మొక్కజొన్న రైతుల కళ్లలో నెత్తురు కనిపిస్తోందన్నారు. ధైర్యంగా ఉండండి.. బేజారు కావద్దని, ఏడాదిన్నరలో మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తారని అప్పటి వరకు కష్టాలను ఓర్చుకోవాలని రైతులకు భరోసా ఇచ్చారు. గోదావరి, కృష్ణాలో ఈ ఏడాది కూడా 248 టీఎంసీల వరకు నీరొచ్చిందని, అంటే 25 లక్షల ఎకరాలకుపైగా పంటలు పండించుకునే అవకాశం ఉండేదన్నారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకొనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇక్కడి రైతులకు ప్రథ మ శత్రువుగా మారారని దుయ్యబట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'ఎల్‌నినో ప్రభావం ఉంటుందని సంవత్సరం ముందు నుంచే వాతావరణ నిపుణులు చెబుతున్నా రు. అలాంటప్పుడు వచ్చే ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టుకొని కాలువలకు పంపింగ్ చేయాలి. కానీ ప్రభుత్వం కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి పథకాలను పూర్తిస్థాయిలో నడపడం లేదు. కృష్ణాలో ఉన్న నీరు పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా 160 టీఎంసీల పైచిలుకు నీరు ఇప్పటికే ఏపీ ప్రభుత్వం తీసుకొని పోయింది. ఇక్కడ ప్రాజెక్టులు, కాలువలు ఉన్నా మోటార్లు ఆన్‌చేయకపోవడంతో నీరొచ్చే పరిస్థితి లేదు. వ్యవసాయశాఖ మంత్రిని, అధికారులను, పార్టీ ఎమ్మెల్యేలంతా కలిసి సమస్యను నివేదించి రైతులను ఆదుకోవాలని కోరతాం. కరవుపై రూ. 20వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలని కేంద్రాన్ని ముఖ్యమంత్రి ఎలా అడిగారో అలాగే తెలంగాణ రైతాంగానికి చేసిన నష్టానికి ప్రత్యేక ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ మాజీ ఎమ్మెల్యేలు జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్‌పై ప్రజలకు ప్రేమ తగ్గలేదు: కేటీఆర్

హైదరాబాద్: బీఆర్ఎస్‌కు అధికారం మాత్రమే పోయిందని.. పార్టీ పట్ల ప్రజలకు ఉన్న ప్రేమ ఇంకా తగ్గలేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. శంషాబాద్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్‌లో ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. శాంతిభద్రతలు సైతం సరిగా లేవని.. పోలీసులు కూడా కాంగ్రెస్ నేతల మాటలే వింటున్నారని ఆరోపించారు. పారిశ్రామిక వేత్తలు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రెండేళ్లలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందన్నారు. ఈ నెల 30న సిరిసిల్లకు వెళ్లనున్న సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. 8 వేల ఎకరాల భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2,400 ఎకరాలు రికవరీ చేసిన వివరాలు బయటపెట్టాలన్నారు. " నేతన్నలకు రూ.60 కోట్ల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు. 10 శాతం యార్న్ సబ్సిడీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. దాని సంగతేంటి? నేతన్న, రైతన్న, విద్యార్థులకు సీఎం రేవంత్ సమాధానం చెప్పాలి. హామీల అమలుపై స్పష్టమైన తేదీలు ప్రకటించాలి. సిరిసిల్ల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## నీళ్లున్నా ఉపయోగించుకోలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం

**భారాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి**

**హైదరాబాద్:** ఎస్సారెస్పీలో 46 టీఎంసీల నీళ్లున్నా ఖరీఫ్‌కు ఉపయోగించుకోలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని భారాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణభవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..'ప్రాణహిత నదీ జలాలను కన్నెపల్లి పంపుహౌస్ నుంచి లిఫ్ట్ చేసేందుకు కేంద్రప్రభుత్వ నివేదిక ఆధారంగా రాష్ట్రానికి నిర్ణయం తీసుకునే అధికారముంది. నీటిని సరఫరా చేసేందుకు అన్ని అవకాశాలున్నా రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌ల వైఖరితో రైతులు అవస్థలు పడుతున్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి ఎస్సారెస్పీ ద్వారా సాగునీరు ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు.



## ఉధృతంగా గోదావరి

- భద్రాచలం వద్ద 42.7 అడుగుల నీటిమట్టం
- పోలవరం నుంచి 8.75 లక్షల క్యూసెక్కుల విడుదల

**భద్రాచలం, సెప్టెంబరు 27:** భద్రాచలం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. అల్పపీడన ప్రభావంతో ఎగువన కురిసిన భారీ వర్షాలకు గోదావరి ఉపనదులు ప్రాణహిత, ఇంద్రావతి నుంచి వచ్చిన వరద.. గోదావరిలో చేరడమే ఇందుకు ప్రధాన కారణం. భద్రాచలంలో శనివారం అర్ధరాత్రి 12గంటలకు 35.8 అడుగులుగా ఉన్న గోదావరి నీటిమట్టం ఆదివారం ఉదయం 6 గంటలకు 39.7 అడుగులకు చేరింది. ఆ తర్వాత 9 గంటలకు 41 అడుగులకు, మధ్యాహ్నం 12 గంటలకు 41.8 అడుగులకు, 3 గంటలకు 42.5 అడుగులు, 4 గంటలకు 42.7 అడుగులకు పెరిగింది. సాయంత్రం 6 గంటలకు 42.8 అడుగులకు చేరింది. దీంతో భద్రాచలం వద్ద గోదావరి నదిలోని స్నాన ఘట్టాలు నీట మునిగాయి. అలాగే కరకట్టపైకి సందర్శకులను అనుమతించడం ఆపేశారు. అయితే, ఎగువన వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో భద్రాచలం వద్ద కూడా గోదావరి నీటి మట్టం క్రమేపీ తగ్గుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, గోదావరి ఉధృతంగా ఉండడంతో పోలవరం ప్రాజెక్టు వద్దకు వరద పోటెత్తుతోంది. పోలవరం స్పిల్‌వే నుంచి 8,75,512 క్యూసెక్కులను దిగువకు విడుదల చేసిన అధికారులు ఆ నీటిని ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి వదిలేస్తున్నారు. పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం పెరగడంతో పట్టిసీమ శివక్షేత్రాన్ని వరద చుట్టుముట్టింది. ఆలయానికి రాకపోకలు నిలిపివేశారు. ఇంకోవైపు. కృష్ణా డెల్టా, ఉమ్మడి పశ్చిమ డెల్టాల సాగునీటి అవసరాల కోసం పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు 7,788 క్యూసెక్కులు విడుదల చేశారు.

## ప్రభుత్వం దృష్టికి పంచాయతీ కార్యదర్శుల సమస్యలు

**హైదరాబాద్:** రాష్ట్రంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి తెలిపారు. తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్) రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఆదివారం హైదరాబాద్ ఖైరతాబాద్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఓపీఎస్ ద్వారా వచ్చిన పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. వాళ్లు పని చేసిన కాలాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని క్రమబద్ధీకరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ల సంఘం, గ్రామ పాలనాధికారుల సంఘం, టీపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రాములు, ఉపేంద్రరావు, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన
తెలుగు దినపత్రిక

# మరవెల్లిలో రూ.47 వేల పలికిన వినాయక లడ్డు

## - రూ.47,000లకు 15 కిలోల లడ్డును దక్కించుకున్న అల్లాదుర్గం బస్వరాజు



**వట్పల్లి, సెప్టెంబర్ 27 (స్పందన)**

వట్పల్లి మండలంలోని మరవెల్లి గ్రామంలో సరట్ల సిద్ధివినాయక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వినాయక లడ్డూ వేలం పాటలో అల్లాదుర్గం గ్రామానికి చెందిన బస్వరాజు రూ.47,000లకు 15 కిలోల లడ్డూను దక్కించుకున్నారు. వినాయక నిమజ్జన వేడుకల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం పాట భక్తులు, గ్రామస్థుల మధ్య ఉత్సాహాన్ని నింపింది. వేలం పాటలో బస్వరాజు రూ.47 వేల ధరకు లడ్డూను సొంతం చేసుకున్నారు. గణనాథుడి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకోవడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. వినాయకుడి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకోవడం తమకు లభించిన అదృష్టంగా భక్తులు భావిస్తారు. భక్తి, విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే ఈ వేలం పాటలు గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యతను చాటిచెబుతున్నాయి. సరట్ల సిద్ధివినాయక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు, యువకులు, గ్రామస్థులు పాల్గొని వినాయకుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.



# పాటి మాజీ ఉపసర్పంచ్ రజనీకాంత్ ను....

## - పరామర్శించిన నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 27, (స్పందన):**



పాటి గ్రామ మాజీ ఉపసర్పంచ్ రజనీకాంత్ ను పరామర్శించిన... కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్. ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి గ్రామ మాజీ ఉపసర్పంచ్ రజినీకాంత్ తండ్రి ఇటీవల మృతి చెందారు. కొన్ని అనివార్య కారణాల వల్ల పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అంత్యక్రియలకు హాజరు కాలేకపోయారు. దాంతో ఆదివారం ఉదయం ఆయన తన అనుచరులతో కలిసి రజనీకాంత్ నివాసానికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, వారికి మనోధైర్యం కల్పించారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# గొప్ప గాంధేయవాది కొండా లక్ష్మణ్ బాపూజీ..

## - ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




**పటాన్ చెరు, సెప్టెంబర్ 27, (స్పందన):**

తొలి, మలి దశ ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటం చేసిన గొప్ప గాంధేయవాది, కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి సందర్భంగా పద్మశాలి సంఘం పటాన్ చెరు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మూడు తరాలపాటు అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. జాతికి వారు చేసిన సేవలను భవిష్యత్తు తరాలకు అందించాలన్న సమున్నత లక్ష్యంతో పటాన్ చెరులో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన అదృష్టం తనకు దక్కిందన్నారు. బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నాయకులు నర్రా బిక్షపతి, రామచంద్రారెడ్డి, వంగరి అశోక్, కంకర శీనయ్య, వెంకటేష్, శంకర్, పద్మశాలి సంఘం ప్రతినిధులు రఘురాములు, ధర్మచంద్, పశు పతి, గీతా వెంకట్, మధు, లక్ష్మణ్, కృష్ణ, వర ప్రసాద్, రాములు, జగదీష్, లక్ష్మణ్, నాగరాజు, సతీష్, విజయ్, పట్టణ నాయకులు, కార్యకర్తలు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ జలదోపిడీకి అడ్డుకట్ట వేయాలి

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు జాతీయహోదా కల్పించి.. దీని నిర్మాణం కోసం చేసిన రుణాన్ని కేంద్రం చెల్లించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నేతలు డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను ఆమోదించి ఏపీ జలదోపిడీకి అడ్డుకట్ట వేయాలన్నారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో సాగునీటి ప్రాజెక్ట్‌లు, బీసీ హక్కుల సాధనపై చర్చించారు. కార్యక్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, జలవనరుల సంఘం మాజీ అధ్యక్షుడు, భారాస నేత వి.ప్రకాశ్, బీసీ సంక్షేమ సంఘం కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, సంఘం నాయకులు నర్సింగ్‌రావు హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ.. తెలంగాణ నీటి ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం అభ్యంతరాలతో అడ్డుపడుతోందని ఆరోపించారు. జనగణనలో ఓబీసీ అంశాన్ని చేర్చాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిగా అమలు చేయాలని, కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లులను తక్షణమే ఆమోదించాలని సమావేశంలో తీర్మానించారు. దత్తాత్రేయ మాట్లాడుతూ.. జల వివాదాలు, నీటికి సంబంధించిన అంశాలపై రాష్ట్రాలు చర్చించుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా నీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. వెనుకబడిన తరగతుల పిల్లలకు అవసరమైన మేర పాఠశాలలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ.. దేశంలోనే కులగణన చేసిన మొదటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. దేశవ్యాప్తంగా బీసీల కులగణన జరిగేంతవరకు బీసీలకు న్యాయం జరగదని, జనగణనలో ఓబీసీ క్లాజ్ చేర్చేవరకు పోరాడతామన్నారు. జూరాల నుంచి ప్రవహించే 400 టీఎంసీల నీటిలో 11 టీఎంసీలు కూడా ఇక్కడి భూములకు రావని, ఏపీలోని రాయలసీమకు 700 కిలోమీటర్ల వరకు తరలిపోతున్నాయన్నారు. గోదావరిపై బ్యారేజీలు నిర్మించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దే అని ప్రకాశ్ పేర్కొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు ఆదర్శనీయం

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, సెప్టెంబర్ 27(స్పందన)**




తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను సంగారెడ్డి లోని ఫ్రూట్ రీసెర్చ్ స్టేషన్ (ఎఫ్ఆర్ఎస్) వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, శాసనసభ్యులు చింతా ప్రభాకర్ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. సమాజంలోని అణగారిన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బాపూజీ చూపిన సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాసేవ మార్గాలను నేటి తరాలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సమాజంలోని అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రేశం గణపయ్య వేడుకల్లో...

## - పటాన్ చెరు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్

## - ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు







**పటాన్ చెరు, సెప్టెంబర్ 27, (స్పందన):**

గణపయ్య నవరాత్రులలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పీఎన్ఆర్ టౌన్‌షిప్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు, కళాకారులు భరతనాట్యం, వివిధ నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. విద్యార్థులను అభినందించి, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఫహాద్ సినిమా కోసం తారక్.. భారీ ఈవెంట్‌కు సన్నాహాలు

మలయాళ స్టార్ నటుడు ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో నటించిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'పై తెలుగు ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగు తోంది. ఈ సినిమాతో ఫహాద్ ఫాజిల్ తెలుగు లో కథానాయకుడిగా నేరుగా అరంగేట్రం చేస్తుండటంతో ఇప్పటికే సినీ వర్గాల్లో చర్చ మొదలైంది. దీనికి తోడు అగ్ర దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈ చిత్రాన్ని సమర్పి స్తుండటంతో సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది.తెలుగు ప్రేక్షకులకు ఫహాద్ ఫాజిల్ కొత్తేమీ కాకపోయినా.. పూర్తిస్థాయి తెలుగు సినిమాలో కథానాయకుడిగా ఆయనను చూడటం ఇదే తొలిసారి. విభిన్నమైన పాత్రలు, సహజమైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఫహాద్.. ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులను ఎలా ఆకట్టుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. ఇటీవల విడుదలైన ప్రచార చిత్రానికి కూడా మంచి స్పందన లభించింది. కథాంశం, ఫహాద్ పాత్ర తీరు ఆసక్తిని కలిగించేలా ఉండటంతో సినిమాపై చర్చ మొదలైంది.



## ప్రమాదం తర్వాత ఆరో రోజే 'మండాడి' షూటింగ్‌కు మహిమా

తమిళంలో ప్రస్తుతం 'మండాడి' సినిమా పేరు మార్మోగుతోంది. సూరి హీరోగా నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయా న్ని అందుకుంది. తెలుగు నటుడు సుహాస్, సీనియర్ నటుడు సత్యరాజ్ కీలక పాత్రల్లో కనిపించగా.. మహిమా నంబియార్ తన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. సెప్టెంబరు 10న విడుదలైన ఈ చిత్రం కొద్ది రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరింది. 'మండాడి' విజయంలో మహిమా నంబి యార్ చూపించిన అంకితభావం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సినిమాలోని 'ఉసురే నీదాన్ పుల్లా' పాట చిత్రీకరణకు ముందు ఆమె తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురయ్యారని దర్శకుడు మతిమారన్ సక్సెస్ మీట్‌లో వెల్లడించారు. ఈ ప్రమాదంలో మహిమా ముఖానికి తీవ్ర గాయాలు కాగా.. 20కి పైగా కుట్లు పడినట్లు ఆయన తెలిపారు.

ప్రమాదం తర్వాత మహిమా పరిస్థితిని చూసి తాను కూడా షాక్‌కు గురయ్యానని దర్శకుడు చెప్పుకొచ్చారు. అలాంటి సమయంలో ఆమెను షూటింగ్‌కు రావాలని అడ గడం కూడా తనకు ఇబ్బందిగా అనిపించిం దన్నారు.



## ప్రమాదంతో కుంగిపోయిన స్నేహ.. మళ్లీ ఎలా వచ్చిందంటే?

తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయం అవసరం లేని కథానాయికల్లో స్నేహ ఒకరు. సహజమైన అందం, చక్కటి అభినయం, కుటుంబ కథా చిత్రాల్లో ఒదిగిపోయే నటనతో ఆమె ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో ఎన్నో విజయవంతమైన సినిమాల్లో నటించిన స్నేహ.. తన కెరీర్‌లో ఓ దశలో ఎదురైన ప్రమాదంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారట.

**వరుస విజయాలతో స్టార్ హీరోయిన్‌గా..**

స్నేహ అసలు పేరు సుహాసిని. తమిళ చిత్రాలతో కెరీర్ ప్రారంభించిన ఆమె.. గోపీచంద్ హీరోగా నటించిన 'తొలివలపు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'ప్రియమైన నీకు' చిత్రంతో మరింత చేరువయ్యారు. ఈ సినిమా విజయం ఆమె కెరీర్‌కు మంచి ఊపునిచ్చింది. అనంతరం 'హనుమాన్ జంక్షన్', 'వెంకీ', 'సంక్రాంతి', 'రాధాగోపాళం', 'శ్రీరామదాసు', 'మహారథి', 'మధు మాసం', 'ఏవండోయ్ శ్రీవారు', 'పాండురంగడు' వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకుల్లో ఆమెకు మంచి ఆదరణ లభించింది.

**ప్రమాదంతో ఎనిమిది నెలలు మంచానికే..**

కెరీర్ మంచి స్థాయిలో కొనసాగుతున్న సమయంలో తాను ఓ ప్రమాదానికి గురైనట్లు స్నేహ గతంలో వెల్లడించారు. ఈ ప్రమాదంలో చేతులు, కాళ్లు, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయని.. దాదాపు ఎనిమిది నెలల పాటు మంచానికే పరిమితం కావాల్సి వచ్చిందని తెలిపారు. కదలడానికి కూడా వీలు లేని పరిస్థితుల్లో ఆ రోజులు ఎంతో కష్టంగా గడిచాయని గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తన కెరీర్ ఇక ముగిసిపోయిందేమోనని కూడా బాధపడ్డానని స్నేహ చెప్పారు.

**దర్శకుడు ఇచ్చిన ధైర్యంతో మళ్లీ కెమెరా ముందుకు..**

ప్రమాదం తర్వాత శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో దర్శకుడు కరు పళనియప్పన్ తనకు అండగా నిలిచారని స్నేహ తెలిపారు. తాను పూర్తిగా కోలుకోకపోయినా.. ఆయన తనలో ధైర్యం నింపి తిరిగి సినిమాల్లో నటించగలననే నమ్మకాన్ని కలిగించారని చెప్పారు. అనంతరం ఆయన దర్శకత్వంలో వచ్చిన 'పార్థిబన్ కనవు' తనను మళ్లీ కెమెరా ముందుకు తీసుకొచ్చిందని, ఆ సినిమా తన కెరీర్‌లో కీలకంగా నిలిచిందని స్నేహ గుర్తుచేసుకున్నారు.

**హీరోయిన్ నుంచి కీలక పాత్రల వైపు..**

ఆ తర్వాత స్నేహ తన పాత్రల ఎంపికలోనూ మార్పులు చేసుకున్నారు. కథలో కీలకమైన సహాయ పాత్రలు చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. 'సన్నాఫ్ సత్యమూర్తి', 'వినయ విధేయ రామ' వంటి తెలుగు చిత్రాల్లో ముఖ్యమైన పాత్రల్లో కనిపించారు. విజయ్ నటించిన 'ది గోట్'లోనూ ఆయన భార్య పాత్రలో నటించి ఆకట్టుకున్నారు.

## మాస్ ఇమేజ్ వైపేనా?



ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా సహాయ దర్శకుడిగా కెరీర్ ప్రారంభించి.. ఆ తర్వాత కథానాయకుడిగా ఎదిగి సహజ నటనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు నాని. 'అష్టా చమ్మా'తో మొదలైన ఆయన ప్రయాణం 'పిల్ల జమీందార్', 'ఈగ', 'భలే భలే మగాడివోయ్', 'నిన్ను కోరి', 'జెర్సీ', 'హాయ్ నాన్న' వంటి విభిన్న చిత్రాలతో కొనసాగింది. అయితే కొంతకాలంగా నాని తన కథల ఎంపికలో కొత్తదనం చూపిస్తూ మాస్ ప్రేక్షకులకు మరింత చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. 'దసరా', 'సరిపోదా శనివారం', 'హిట్ 3' వంటి చిత్రాల్లో నాని గతంలో కనిపించని రీతిలో పాత్రలు పోషించారు. రఫ్ లుక్, యాక్షన్ సన్నివేశాలు, మాస్ తరహా శరీర భాషతో కొత్త కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. దీంతో క్లాస్ హీరోగా ఉన్న తన ఇమేజ్‌ను విస్తరించుకునే దిశగా నాని అడుగులు వేస్తున్నారనే చర్చ మొదలైంది.



## 'ది వాన్'తోనూ నిరాశేనా?

ముంబయి నుంచి వచ్చి టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన తమన్నా భాటియా.. దక్షిణాదిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'మిల్కీ బ్యూటీ'గా అభిమానుల మన్ననలు అందుకున్న ఆమె.. స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలతో అగ్ర కథానాయికగా కొనసాగారు. అయితే బాలీవుడ్‌లో మాత్రం హీరోయిన్‌గా ఆశించిన స్థాయిలో విజయాలు దక్కడం లేదనే చర్చ తరచూ వినిపిస్తోంది. సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా నటించిన 'ది వాన్'లో తమన్నా కథానాయికగా కనిపించారు. అడవిలోని తమ కుటుంబ భూమికి సంబంధించిన వివాదం నేపథ్యంలో సొంతూరికి వెళ్లే నాస్తికుడైన వ్యక్తి ఎదుర్కొనే పరిస్థితుల చుట్టూ కథ సాగుతుంది. ఇందులో హీరో భార్యగా తమన్నా నటించారు. అయితే కథ మొత్తం హీరో చుట్టూనే తిరగడంతో ఆమె పాత్రకు పెద్దగా ప్రాధాన్యం లేదనే అభిప్రాయాలు కొందరు విమర్శకుల నుంచి వ్యక్తమవుతున్నాయి. 'ది వాన్'లో తమన్నా కనిపించే పాటకు మాత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందని తెలుస్తోంది. అయితే కథానాయికగా ఆమె నటనపై పెద్దగా చర్చ జరగడం లేదనే కామెంట్లు వినిపిస్తున్నాయి. దీంతో ఈ సినిమా కూడా తమన్నా బాలీవుడ్ కెరీర్‌లో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయిందనే చర్చ మొదలైంది. బాలీవుడ్‌లో ప్రత్యేక పాటల విషయంలో మాత్రం తమన్నాకు మంచి ఆదరణ లభించింది. 'స్త్రీ 2', 'రైడ్ 2' వంటి చిత్రాల్లో ఆమె చేసిన ప్రత్యేక పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మరోవైపు 'లస్ట్ స్టోరీస్ 2', 'ప్లాన్ ఎ ప్లాన్ బి', 'బబ్లీ బౌన్సర్' వంటి చిత్రాల్లో కథానాయికగా కనిపించినా.. అవి ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయాయి. ఇప్పుడు 'ది వాన్'పై వస్తున్న స్పందన నేపథ్యంలో బాలీవుడ్‌లో తమన్నా తదుపరి ప్రాజెక్టులపై ఆసక్తి నెలకొంది.

Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780